నందనవనం అయిందా ?'' అని అడిగేడు మిత్రుడు. "ఆ కథలో ఇంక నందనవనం గిందనవనం రాదు. ఆ కాకిరూపుదాల్చిన మన్మధుడు ఆఁ అని దీర్ఘంకూడా తీయలేనంత దప్పికగొన్న వాడౌ కుంభూ " క్క్క్ '' అని కంఠమ్ముడి ఇగుర్చుకుపోయి గతిస్తాడు. పాపం ! ''

.... .... .... .... ....

## కలి వాయు

సాయంత్రం !—సుకుటుంబరావు ఇక్కడ ' సు 'కు ' కుటుంబ రావు ' కు మధ్య చుక్క పెడితే ' సు ' ఇంటిపేరు కావచ్చు ; పెట్టకపోతే పేరుకు ' సు ' మంచి అనే అర్థం ఇస్తూ విరాజిల్ల వచ్చు. సర్వసాధారణంగా మధ్యను చుక్కలేకుండానే పిలవ బడతాడు ఆయన ఏక ఊపిరిని " సుకుటుంబరావుగారూ ! " అని.

ఈ సుకుటుంబరావు వయస్సు అరవై పై మీటి, ఎలా చూచినా వృద్ధుడని అనుకోవలసిన వాడైనాడు. ఒక దళ గడచే లోపల. ఈ వృద్ధప్రపితామహునకు ఒక అపూర్వమైన ఉద్దేశ్యం. ఒక సాయంత్రం అట్టే తట్టి. ఇట్టే బజారుకు వెళ్ళి, భార్యకు తెలియకుండానే తాను తెచ్చుకోదలచిన సరుకులు తెచ్చుకుని తిన్నగా మేడమీదకు వెళ్ళిపోయి దాచేసేసి కిందకువచ్చి, రాత్రి ఎనిమిదింటికి మామూలుగా భోజనం చేసుకుని తిరిగి మేడ మీదకు తన గదిలోకి రాత్రితొమ్మిదిన్నరకు ఎప్పటిలాగ ఏమీ ఓపికలేనివానిలా మేడెక్కిపోయి తన పడగ్గదిలో ప్రవేశించాడు.

సుకుటుంబరావు భార్య, అలా తన భర్త ఏదో మామూలుగా వెళ్ళివచ్చారు సాయంత్రం వాహ్యాళికి అని " ఎక్కడికి

వెళ్ళారు? ఏం తెచ్చారు?" ఇత్యాదిగా ప్రత్యేకించి అడగలేదు. అసలు ఆదాకా ఆయన్ను విశేషం పలకరించలేదు ఆమె. భర్త కిమఃనాస్తిగా వుండిపోవడంకూడా ఆమెలోని మౌనమునకు కొంత కారణం అని మనం ఊహించవచ్చు. అయితే ఈమె బుద్ధిమాత్రం సామాన్యపుదా ఏమి? ఆమెకూ ఆ సాయంత్రమే. ఏదో ఆలోచన నూతనంగా తట్టింది. కాని ఆమె చేయబోయే విచిత్ర చర్య ఆదాకా ఎవరికీ చెప్పలేదు.

"ఆదాకా" "ఆదాకా" అని రెండు పర్యాయములు నేను వక్కాణించింది ఎందుకో అని ఇతరులెవ్వరూ వేచుకుని ఉండవలసిన తరుణం కాదది. ఒక్క అలాంటి పుణ్యదంపతులదే ఆ తరుణం! ఆయన పాదాలు రెండూ అలా తనకళ్ళ నద్దుకుని, తాను తన పక్కమీద ఆ గదిలోనో, మరోచోట పిల్లాజెల్లా నిదు రించే చోటనో శయనించేదిట! "ఆదాకా" అంటే రాత్రిభాగ మందలి ఆవేళప్పటి ఆ అరగంట టైమూ అన్నమాట.

మరి సుకుటుంబరావుగారి భార్యయొక్క పుట్టుపూర్వో త్తరాలు సుకుటుంబరావుగారివైన వాటికేమాత్రం తీసిపోయేవికావు. ఆయన సుగుణాలకోవకు ఒకతట్టు సగం అయితే యీమె రెండవ తట్టు సగమూను. ఇద్దఱకూ వయస్సులో తేడా పదేళ్లు. రూపు రేఖలకు ఇద్దరూ సరిసమానం. ఆయన వన్నే బంగారువన్నె! ఈమెవన్నే బంగారువన్నే! ఇద్దరూ ఒకేసారి పళ్ళు కట్టించు కున్నారు. ఆ పళ్ళు ఇద్దరూకూడా దాచుకుని ఎంతో అవసరం వస్తేనేగాని వాడుకునేవారుకారు. ఇద్దరి తలలూ నెరిసేపోయి నాయి ముగ్గుబుట్టలా అరవైయేళ్లు వచ్చిన నేనెలావున్నానో కాని యీ కథాదినిపడ్డ సాయంత్రం గాని, ఆ సాయంత్రం

పొడిగించగా ఏర్పడ్డ యీ రాత్రి లోపుగాగాని యీ రకంగా సంభాషణ వారిద్దరిమధ్యా ఏ మాత్రం జరిగియుండలేదు. భర్త పన్నాగంలో భర్త, భార్యపన్నాగంలో భార్య, మరిన్నీ మరిన్నీ నిమగ్నులై వుండిపోయినారు. ఆ రాత్రి 9-30 10-30 ఆ మధ్య ఎవరి ముస్తాబు వారు, ఎవరిషోకు వారు ఊరకే వేసేసుకో సాగారు. ఒకరు మేడమీద ఒకరు క్రిందాను.

అదంతా ఇప్పుడు నేను వ్రాసేకన్న, కథ చివర తేలింపు నుండి, వెనక్కు సింహావలోకనం గావిస్తే, పాఠకులకు ఎక్కువ సొంపుగా కనిపించగలదని నా వూహ.

10-30 రాత్రి అయ్యేసరికి సుకుటుంబరావు ఏంచేశాడు ; అంత వృద్ధూ, కాళ్లు తన్నిపెట్టి తెల్లదుప్పటి పొడుగుతా జుట్టు అయినా కనబడకుండా ముసిగెట్టుకుని, గుర్రుకొడుతూవున్నాడు, ఎక్కడ ? మేడమీద తన పడగ్గదిలో పందిరి పట్టెమంచం పాన్పుమీద ! ఏనాటి మంచమో అది ? ఈ కాలంలో అలాంటి మంచాలూ లేవు, అలాంటి పరుపులూ లేవు ! అయితే అలాంటి మనుష్యులూ అలాంటి రివాజులూ ఉన్నాయా అనేది కూడా వేయదగ్గ ప్రశ్నే !

సరిగ్గా అదే టైముకు సుకుటుంబరావుగారి సువాసిని, ఈమె మేడమీద కెక్కింది. ఈమె వేసుకున్న వేషంమీద ఏ విధమైన మేలిముసుగూ లేదు. తెల్లని తల్లో కనకాంబరాలూ, చంద్రకాంతలూ పెట్టుకుంది. ఏడువారాల నగలూ ఉంచుకుంది. నోటికి పళ్లు తగిలించుకుంది. ధవళిమలోనూ దడియంలోనూ కూడా, ఆలాంటి దీ రోజుల్లో పోగులయినా కానరాని మాంచి పురాతనపు వెల్లా విలువా, సన్నం మన్నిక అన్నీ కుదిరికూర్చిన

నేలం జరీచీర—పెద్ద జరీచీర—పవిటంచు జరీ వెడల్పు జేనెడు మీద బెత్తెడుగలది. చుట్టూ అంచు జరీ ఓ నాలుగుజిట్టలు పోసింది. దివ్యంగా చాకల్ది ఆ సాయంతరం తెలుపుచేసి, ఇస్త్రీ మడతగా తళుకు బెడబెడగా తెచ్చింది కట్టుకుంది! మఱి అందుకుతగ్గ రవిక తొడిగింది. టింగురంగామంటూ మేడెక్కింది కాని ఎక్కడంలో మాత్రం మట్టెలచప్పుడుగాని, మంగళ సూత్రాల చప్పుడుగాని ఏమాత్రమున్ను కానీయలేదు. అదంతా భర్తగారి నిదర చెడుతుందేమో అని చూసిన అభినయంకాదు. లోపలి అభిప్రాయాన్ని బట్టి చేసిందే!

తలుపుజేరవేసి ఎలెక్ట్రిక్లైటు వేసింది. వేస్తూ భర్త కప్పుకున్న దుప్పటీ టలాపుదిక్కున కొంచెం అలా వొత్తిగించి తన ముఖం భర్తముఖంమీద పుంచింది. చెంపా చెంపా ఇద్దఱిదీ అన్యోన్యం తగిలాయన్నా తప్పులేదు?

సుకుటుంబరావు వెంటనే కళ్లుతెరచి, ముసుగు తీసివేసి కొంటూ, "బల్బు మార్చావా లైటుది? ఇంత తేటెక్కింది గది! ఎప్పుడూలేంది!" అని నివ్వెరపోయాడు. తన కట్టుపళ్లు తాను కూడా ఆ రాత్రి ధరించబోలు, వాటితో నవ్వుతూ, భార్య, తన కట్టుపళ్లుపైకి కనబడేలా చిరునవ్వునవ్వుతూ "జుట్టుకు నల్ల రంగేశారే! ఈ రాత్రి! ఈ రాత్రి మీకింత ముస్తాబుకావాలని ఏలా తోచింది! కుసింతా చెప్పారుకాదు నాకు సాయంత్రం బజారుకు వెళ్తున్నాను షికారుక్కాదని!" అంటూ ఒక్కలగా మున మంచం పైకి ఎగిరి కూర్చుంది.

సుకుటుంబరావు "వస్తువులు వాహనాలు రోజూచూస్తూనే వున్నాను కాని, ఈ చీరెక్కడ సంపాదించావు? మిలమిలా

తళతళా మనేశావు! దీని మూలంగానే గది కింత పూరాతేటు వచ్చిందని అనుకుంటాను. ఈ సాయంత్రం బజార్నుంచి తెప్పించుకొన్నదైతే యీ తెలుపూ యీ పెళపెళా వుండనేరవు. అసలీరోజుల్లో యీలాంటి చీరలు యీలా జరీపిట్టలూ పిందెలూ ఉన్నవి ఉన్నాయా ఏమిటి? ఏనాటిదో అయివుండాలి! నీదేనా? నీదేనా?" అంటూ పవిటికొంగు పరీక్షించేడు.

భార్య "నాదికాదు అనే వాదుకూడా తెచ్చిపెట్టకండి. మీరూ నేనూకూడా మఱచిపోయినాం దీన్నిగురించే. ఇది మన తొలిరేయిచీర! అయితే ఇది నాగరీక సంబంధమైన చీరకాదని, అత్తింట మెట్టినప్పట్నుంచి. పెట్టి అడుగున పదేసి, వుంచీ ఉంచీ కొన్ని దశలయ్యాక ఒక రోజున అయిదో చంటాడి పక్కకని పైకి తీశాను. పైకితీస్తే కంపు కంపు కొట్టింది. మఱిదాన్ని ఆలా మీకు చూపించినా, వాడికి పక్కేసినా, నన్ను చంపేసి పోతారు మీరుఅని మీకు తెలియకుండా దాన్ని వొక రోజున చాకల్దానికివేసి, పదిలంగా వుతుక్కురావే అని హెచ్చరించాను. అది దణ్ణాలుపెడుతూ అదట్టుకు పోయి నాటికి నేటికి తెచ్చిందే లేదు. తబ్దీలయింది అమ్మగారూ ఎవళ్ళబట్టల్లోనో అంటూ ఉత్త చేతులాడించుకొని వచ్చింది. క్రమంగా వాదులాటకు వచ్చింది. సరి ఇలా అదీ నేను వాదులాడుకుంటూ పదేళ్లైనా నెట్టుకు వచ్చాం. పోలేదు ఎక్కడో దొరుకుతుంది తెస్తాను" అనేది కాని తెచ్చేది కాదు. దాని ముఖం చూచినప్పుడల్లా నాలో ఆశ చచ్చేది కాదు. ఎప్పుడు పట్టుకువస్తావో చెప్పు అని ఓపర్యాయం, పట్టుకురాకపోతే చూడు నీ పనీ నీ మొగుడిపనీ కూడా పట్టిస్తానని ఒక పర్యాయం, నీవు పట్టుకురాకపోతే జీతంలో విరగ్గోస్తా అని

ఒక పర్యాయం, ఇలా అలా గదుముతూ రాగా రాగా, దాని కేంతోచిందో,—మీరు అలా–షికారు కనుకొన్నాను–వెళ్ళారు !, అదీ చీర నాది నాకు తెచ్చియిచ్చింది. తెచ్చిన పాళంగా దాన్ని అలా దాచి, ఈ రాత్రి మిమ్మల్ని మురిపిద్దామని తలపోశాను. అదేమిటో, ఆ చీర దగ్గఉలేని కారణంవల్లనే అసలు నాకు అకాలంగా ముదిమివచ్చేసింది అని నా నమ్మకం. ఆడవాళ్ళ ముసిలితనానికి చాకలాళ్ళే కారకులని నేను ఖచ్చితంగా చెప్ప గలను. మీరేమంటారు ? ఈ చీర కట్టుకున్నాక నే నెలావున్నా నంటారు ? అని రొక్కించి అడిగినట్టు అడిగింది.

సుకుటుంబరావు "కాదని ఏలా అంటాను ! మరి నీముదిమికి చాకలి కారణభూతురాలవితే నా ముదిమికి ?" "భార్య" లేడూవాడు ! పెదమంత్రి ! మీ నెత్తిమీద యీ పదేళ్ళనుండి బయలుదేరుతూ వచ్చిన తెల్ల వెండ్రుకలన్నీ, ఏ యుదయానివా యుదయంలాగేసి, ఒక్క నల్ల వెంద్రుకలే అట్టేపెట్టివుంటే అసలు మీ జుత్తు ఎందుకు తెల్లబడుతుంది ? ఈ రంగెందుకు వెయ్యడం వస్తుంది ? కాని ఒకందుకు సంతోషంగా వుంది ! ఒకే ఘటికను మీకూ నాకూ యీ సాయంత్రం ఒకే అభిప్రాయం తట్టడమనేది యీశ్వరేచ్ఛ ! ఏమంటారు ?" అని అద్దంకేసి భర్తముఖం త్రిప్పి దాని ప్రక్కనే తనముఖం చేర్చింది, అదో చెలిమిగా !

సరిగ్గా అదేవేళకు రోడ్డుమీదపోయే మోటార్‌లైట్ వీరి గది కిటికీగుండా నిలువుటద్దంమీదకు ప్రసరించి అందునుండి ప్రతిఫలనం దంపతుల ముఖాలమీదకు వెన్నెల్లా కాసింది,

ఎంత ముసిలివారైనా దీపావళీకాంతికి పునఃశ్శైశవం విజృంభించి టపాకాయ కాలుస్తారే! అలా పై వెలుగున ఆ దంపతులు నాటిరేయి పునర్యౌవనము రేకెత్తినవారై—వారు—ఆ దంపతులు—గది కిటికీతలుపులు గాలికి మూతబడ్డాయి!

.... .... .... .... ....

## అంతులేని ఆకలి

"నెం 1 కలకత్తామెయిల్ మద్రాస్ సెంట్రల్‌స్టేషన్ 19 గంటలకు సరిగా వదులును" అని నల్లని అచ్చక్షరాల్తో రైల్వేగైడ్‌లో తేట తెల్లంగా 1 వ అక్టోబరునుంచీ కనబడుతున్నా, డిశంబరు 20 వ తేదిని బయలుదేరినవారిలో చాలామంది, తమకు రైలు దాటి పోయేటంత ఆలస్యంగా సన్నాహులై స్టేషనుకువచ్చి ప్లాట్‌ఫారమ్ మీద కంగారుకాపరిచినవారే, మగాళ్ళ మాట చెప్పకండి! వాళ్ళకు వేయిపన్లు! ఆడవాళ్ళు? అందులోనూ ఆ! ఆ! ఆ యువతి? ఆమెపేరు? వినయమ్మ. ఆమె ఓచేత ట్రంకుపెట్టె, ఓచేత బెడ్డింగు బరువుగా మోచుకొంటూ, ఆడవాళ్ళబండీ ఎక్కడండీ? ఎక్కడండీ? నే నెక్కేదాకా ఉంటుందా? టైముందా?" అంటూ టిక్కట్లు కత్తిరించే ఆతన్ని అడుగుతూ అతని జవాబు వినకుండా ముందుకు చొఱబడిపోతూ అప్పుడామె పడిన చీకాకు వర్ణనాతీతము! ఒకానొక యువకుడు "ఇక్కడ! ఆడవాళ్ళ బండీ ఎక్కండ"ని దారిచూపించే వఱకూ ఆమె క్కావలసిన పెట్టె కనబడనేలేదు, మొత్తానికి ఇలా రైలెక్కింది. అల్లా మెయిల్‌బండీ వచ్చింది.